స్వాతి - 1988

# ముహూర్తం

నలభైయేళ్ళ క్రితం సంఘటన. అప్పటికి వెంకట్రామయ్య పెంకుటిల్లు ఇంకా మేడవలేదు. ఊరికింకా కరెంటు రాలేదు. ఊరికి ఒక మైలు దూరంలో ఉన్న తారు రోడ్డు మీద నుండి ఊళ్ళోకి మట్టిరోడ్డు కూడా లేదు.

రెండు పిల్లకాలువల మధ్యనున్న గట్టు మీద నుండి అరటి తోటలోకి అడ్డం పడి వెళ్తే రోడ్డు మీద బస్సు లాగే చోటికి చేరచ్చు.

బండి సుబ్బన్న ఆ దారినే జాగ్రత్తగా బండిని తోలుకుంటూ కమలని బస్సులాగే చోటుకి తీసుకొచ్చాడు.

ఆ రోజు బాగా ముసురుపట్టింది.

గట్టిగా గాలి కూడా వీస్తోంది.

అయినా సీతారామశాస్త్రి పెట్టిన ముహూర్తం మీద గురికొద్దీ ఆ రోజే కోడల్ని ప్రయాణం కట్టించాడు వెంకట్రామయ్య.

కానుపుకి పంపడానికి ఆ రోజు దివ్యమైన ముహూర్తం అన్నాడు సీతారామశాస్త్రి.

దట్టమైన మబ్బునూ, విపరీతమైన గాలినీ చూసి ప్రయాణం మర్నాటికి మారిస్తే బాగుంటుందేమోనని అందామనుకున్నా

తండ్రితో ఆ మాట అని ప్రయోజనం లేదని ఊరుకున్నాడు రాఘవరావు.

కమలకి ఆ ఆలోచన వచ్చినా మావగారితో అనడానికి భయం.

ఆ భయమే అణుకువగా కనిపించేది వెంకట్రామయ్యకి.

అదే ఎంతో గర్వంగా అనిపించేది కూడా.

చేతిలో పొన్నుకర్రా, చెంపల నిండా బుర్రమీసాలూ, వందెకరాల పొలం, నోరెత్తని కొడుకు, అణుకువగా ఉండే కోడలు - ఇవన్నీ వెంకట్రామయ్య గర్వంగా చూసుకునే ఆస్తులు.

కమల నిజంగా గర్వంగా చూసుకోదగ్గ ఆస్తి.

కమల చాలా బావుంటుంది అంటే సరిపోదు.

కమల శరీరపు రంగు ముందు పాలరాయి కూడా పాలిపోయినట్లుంటుంది.

ఆ రంగు అంతకు ముందు ఎవ్వరూ చూసుండరు.

దేవుడు కమల కోసమే ఆ రంగుని ఇన్నాళ్ళూ దాచుకున్నాడేమో అనిపిస్తుంది - ఆ తెలుపు, గులాబీరంగు కలయికని చూస్తే.

కమల శరీరంలో ఏ భాగానికి ఎక్కువ తక్కువలు లేవు.

అందంగా ఉండే కళ్ళు, ముక్కు, పెదవులు, జుట్టూ -

అన్నింటినీ ఎంతో శ్రద్ధతో అందంగా మలిస్తే కమలవుతుంది.

అందుకే వెంకట్రామయ్యకి కమల కోడలయిందని మరీ గర్వం.

వెంకట్రామయ్యా, రాఘవరావు ముందుగా నడుచుకుంటూ వెళ్ళారు బస్సులాగే చోటకి.

బస్సులాగాల్సిన చోటికి పక్కనే పెద్దపాకలో చిన్న హోటలుంది.

అదొక్కటే అక్కడ ఇల్లు అయినా, పాకయినా.

వెంకట్రామయ్యా, కొడుకూ పాకలో కూర్చున్నారు.

కాస్సేపటికి -

బండిని అక్కడున్న చెట్టు కింద ఆపి తాము వచ్చామని చెప్పడానికన్నట్టు హోటల్ గుమ్మం దగ్గరకెళ్ళి నిలబడ్డాడు సుబ్బన్న.

రాఘవరావు తండ్రి చూడకుండా బయటికి తొంగిచూశాడు.

చెట్టు కింద బండిలో కూర్చునుంది కమల.

వాన కురిసినా పూర్తిగా తడవదనుకున్నాడు రాఘవరావు.

బస్సు కోసం చూస్తున్నారు నలుగురూ -

అలాచూస్తూండగానే -

చినుకులు మొదలయ్యాయి.

జల్లు పెద్దదయింది.

కుంభవృష్టిగా తయారయింది.

గాలి బాగా పెరిగింది.

వానలో తడవకుండా గుమ్మంలోకి తప్పుకున్నాడు సుబ్బన్న.

గాలికి వానజల్లు బండిలోకి వచ్చేస్తోంది.

తడిసిపోయిన కమలకి చలి బాగా ఎక్కువయింది.

ఎంత ముడుచుకుకూర్చున్నా వణుకుతూనే ఉంది.

బస్సు వచ్చేస్తే బాగుండుననిపించింది.

అలా కాకపోయినా, తన్ని కూడా పాకలోకి పిలిస్తే బాగుండుననుకుంది.

లోపల కూర్చున్న రాఘవరావుకి ఇబ్బందిగా ఉంది.

వానలో కమల తడుస్తోందని తెలుసతనికి.

కమలని లోపలికి రమ్మంటే తండ్రి ఏమనుకుంటాడోనని భయం.

కమలకి చలి తగ్గడం లేదు. లేచి లోపలికి వెళ్దామంటే మావగారున్నారు లోపల. ఆయన ఏమంటారోనన్న ఆలోచన.

వెంకట్రామయ్య మనస్సులోకి కమల బండిలో తడుస్తోందన్న ఆలోచన వచ్చిందో, లేదో తెలియదు.

వచ్చినా తన కోడలు పాక హోటల్లోకి రావడమేంటని ఊరుకున్నాడేమో.

విడవకుండా వాన.

ప్రళయకాల పర్జన్య గర్జనల్లా ఉరుములు.

విలయకాలోద్భవిత బడబాగ్ని కీలల్లా మెరుపులు.

గాలి వీస్తూనే ఉంది.

నిలువెత్తు తాడి చెట్లు సగం దాకా వంగి లేస్తున్నాయి.

కొమ్మలు ఊగుతూనే ఉన్నాయి.

సుబ్బన్న బండినీ, ఎద్దునూ చూస్తున్నాడు.

రాఘవరావు దొంగతనంగా కమలని చూస్తున్నాడు.

వెంకట్రామయ్య ముహూర్తం దాటిపోతుందేమోనని చూస్తున్నాడు.

సరిగ్గా అప్పుడే-

బండి పక్కనున్న చెట్టు కొమ్మ విరిగి బండి మీద పడింది.

ఆ ఊపుకి బండి చక్రాలు విరిగాయి.

ఎద్దు ఒక్క ఉదుటున పైకి లేచి పక్కకి వాలింది.

కొమ్మ కింద బండిలో కమల.

శరీరమంతా బండిలో తల మాత్రం బయటకి.

ముగ్గురూ పరిగెత్తారు.

సుబ్బన్న కొమ్మని తొయ్యబోయాడు. అది కదల్లేదు.

రాఘవరావు చెయ్యి వేశాడు. వెంకట్రామయ్య సాయం చేశాడు.

కొమ్మ కదల్లేదు.

బాధతో కమల అరుస్తోంది.

కమల మొహం చూడలేకపోతున్నారు ముగ్గురూ.

కొమ్మ ఎత్తడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు.

ఆ బరువుని ఎత్తేస్తే బతుకుతానని ఏడ్చింది కమల.

ఏడుస్తూండిపోయింది కమల.

ఏడుస్తూనే పోయింది కమల.

*(ఈ కథ నలభై యేళ్ళ క్రితం నిజంగా జరిగిందట. అయితే కమల ఎత్తమన్న బరువు - చెట్టు కొమ్మదా, ముహూర్తం మీద గురిదా, గొప్పింటి ఆడవాళ్ళు పాకహోటల్లోకి రాకూడదన్న భావానిదా - అన్న విషయం నాకింకా అర్థం కాలేదు*

* * *